క్లుప్తంగా

డీటీఓ బాధ్యతల స్వీకరణ



తిరుపతి రవాణాశాఖ అధికారి ఆదినారాయణను సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆదినారాయణను రాష్ట్ర రవాణాశాఖ సభ్యులు ఎం.సునీల్‌చక్రవర్తి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. డీటీఓకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంవీఐలు సుబ్రమణ్యం, శ్రీనివాసరావు ఉన్నారు.

అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న అక్కినేని అభిమాన సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: అక్కినేని నాగేశ్వరరావు పదో వర్ధంతిని పురస్కరించుకుని అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో శ్రీగోవిందరాజ స్వామి కోనేటి వద్ద సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అక్కినేని అభిమాన సంఘ నేతలు గోపినాథ్, జగన్నాథం, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాలరాజు, ప్రసాద్, శ్రీనివాసులు, రామ్మూర్తి, మునికృష్ణారెడ్డి, బాబు, కేశవ, కుమార్ పాల్గొన్నారు.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు జీఓ నంబర్ 549 ప్రకారం రూ.16,000 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 225 మంది పారిశుద్ధ్య కార్మికులతో పనిచేయాల్సి ఉందని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. కానీ కాంట్రాక్టర్ కేవలం 90 మందితో విధులు నిర్వహిస్తూ 24 మందికి సంబంధించిన వేతనాలను స్వాహా చేస్తున్నారని దుయ్యబట్టారు. రూ.16000 వేతనాలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.12 వేలు ఇస్తూ కార్మికుల కడుపు కొడుతుండడం దుర్మార్గమన్నారు. అన్నీ తెలిసిన అధికారులు తమకేం సంబంధం లేదు అన్నట్టు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకుని పక్షంలో సమ్మె నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, యూనియన్ నాయకులు పార్వతి, జ్యోతి, లత, రమణమ్మ, సోమశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం రాజ్యసభ ఎంపీ సుజనా చౌదరి, రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, ఫిషడ్ వైస్ చైర్మన్ రఘురాం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సీతారాములకు పూజలు



గాంధీ రోడ్డులో అన్నదానం చేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: అయోధ్య రామమందిరం ప్రారంభాన్ని పురస్కరించుకుని డాక్టర్ వైఎస్సార్ ప్రజాప్రస్థానం, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు ఆధ్వర్యంలో గాంధీరోడ్డులో పేదలకు అన్నదానం, అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీసీతారాముల చిత్రపటానికి పూజలు నిర్వహించి జైశ్రీరామ్ నినాదాలు చేశారు. పురుషోత్తముని ఆశయం కొనసాగిద్దామని, భారతజాతి నిర్మాణానికి మన వంతు కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీరామునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతిలోని కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సీతారాముల చిత్రపటం ఊరేగింపులో రామ భక్తులు







అయోధ్యరాముడి ఆగమనం.. అవనికే ఆనందం

యావత్ భారతమంతా రామనామంతో మార్మోగింది.. అయోధ్య రాముడి ఆగమనంతో అవని పులకించిపోయింది.

దశరథరాముడి ప్రాణప్రతిష్టను దేశ ప్రజలంతా కనులారా వీక్షించారు. ప్రతి పల్లె, పట్టణాల్లో ప్రతి ఒక్కరూ సీతారాములను పూజించారు. అందరి నోటా రామనామ స్మరణే.. ప్రతి ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు పూజలు చేశారు. ప్రతి ఇంటా దీపపు కాంతులు వెలిగించి దశరథరాముడి మీద భక్తిని చాటుకున్నారు.

- యావత్ భారతం.. రామనామ స్మరణం
- ఘనంగా సంపూర్ణ రామాయణ పారాయణం
- చారిత్రాత్మకం.. అయోధ్య రామాలయం

తిరుమల: అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో సోమవారం సంపూర్ణ వాల్మీకి రామాయణ పారాయణం ఘనంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సీతాలక్ష్మణ సమేత రాములవారికి, హనుమంతుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ కలిపి 20 వేలకు పైగా శ్లోకాలను పారాయణం చేశారు. అదేవిధంగా యాగశాలలో వేద విద్యార్థులతో ఏడు వేదశాఖల సంపూర్ణ మూలపారాయణం చేపట్టారు. వీటితో పాటు ఆనంద నిలయంలో ప్రబంధ, ఆగమ విద్యార్థులతో శ్రీసీతారామ మంత్రానుష్టానం, కార్యాలయంలోని హాలులో స్మార్త విద్యార్థులతో శ్రీ లక్ష్మణ, హనుమ మంత్రానుష్టానం చేశారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపల్ కేఎస్ఎస్.అవధాని, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.





భాకరాపేట: పూజలందుకుంటున్న సీతారాములు,ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

మార్మోగిన రామనామం..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో ఆలయాలు, ఇళ్ల వద్ద రామనామం మార్మోగింది. సోమవారం వేకువజామున నుంచే ఆలయాలు, ప్రతి ఇంటిలోని దైవ మందిరాల్లో ప్రత్యేక దీపాలు వెలిగించారు. చిన్నగొట్టిగల్లు దిగువ వీధిలో సీతారాముల కల్యాణం, శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణం, ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు రకాల వంటకాలతో అన్నదానం చేపట్టారు.

అఖండ ధర్మ జ్యోతి ప్రజ్వలన

పాకాల : మండలంలోని దామలచెరువు సీతారామాంజనేయ స్వామి గర్భాలయంలో అఖండ ధర్మజ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఆలయం 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భక్తుల సౌకర్యార్థం దామలచెరువు శ్రీరామ భక్తి యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు.

స్థానిక ఆలయాల్లో ప్రత్యేక దీపాలు

తిరుపతి గాంధీ రోడ్డు: అయోధ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా దీపారాధన కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా తిరుపతి పెద్ద కాపు వీధిలో ఉన్న భజన మందిరంలో స్థానిక ఆలయ పాలకమండలి సభ్యులు, మహిళలతో కలిసి బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామునికి ప్రత్యేక పూజలు

తిరుపతి కల్చరల్: అయోధ్య రామజన్మభూమిలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట జరగడం ఒక చారిత్రాత్మకమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని రష్ ఆస్పత్రిలో శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లమిట్ట కూడలిలో..

తిరుపతి కల్చరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహప్రతిష్టను పురస్కరించుకుని సోమవారం గాండ్లమిట్ట కూడలిలోని భజన మందిరం వద్ద శ్రీరాముడికి విశేష పూజలు నిర్వహించారు. గాండ్ల సంఘ నేతల ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్ ద్వారా అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్టను తిలకించే భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి గాండ్లసంఘం నేతలు గిరి, శేఖర్, వేణు, దాము, శేషు, భార్గవ్, చంద్రకాంత్ బాబు, రజనీకాంత్‌బాబు, జగన్నాథం, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన రామనామ సంకీర్తన

తిరుపతి కల్చరల్: అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని కపిలేశ్వర పురోహిత సేవాసంఘం ఆధ్వర్యంలో నగర వీధుల్లో రామసంకీర్తన సంచారంతో తమ రామభక్తిని చాటుకున్నారు. గాంధీ రోడ్డులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీకోదండ రామాలయం వరకు జై శ్రీరామ నినాదంతో పాటు రామనామ సంకీర్తనలు గానం చేశారు. కార్యక్రమంలో కపిలేశ్వర పురోహిత సేవాసంఘం నేతలు, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల చిత్రపటం ఊరేగింపు

పాకాల : శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఆధ్వర్యంలో పాకాలలో సీతారాముల చిత్రపటం ఊరేగింపు నిర్వహించారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు భోజన వితరణ చేశారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

తిరుపతి(అలిపిరి): బాల రాముడిపై సూర్యకిరణాలు ప్రసరించేలా ప్రపంచంలోనే మూడో దేవాలయంగా అయోధ్యలో రామాలయం నిర్మించడం గొప్ప విషయమని టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రాతిష్ట సందర్భంగా తితిదే ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అయోధ్యలోని శ్రీరాముని ఆలయంలో కాలి అడుగుతో కొలిచి ఆలయాన్ని డిజైన్ చేశారని, భూకంపం వచ్చినా తట్టుకునేలా ఆలయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ఆలయంలో ఇనుము వాడకుండా 115 దేశాల మట్టి, నీటితో ఆలయ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ మందిరాన్ని 2500 ఏళ్లు చెక్కుచెదరకుండా ఉండేలా నిర్మించారని, 500 ఏళ్ల తరువాత అయోధ్యలో శ్రీరామపట్టాభిషేకం, 132 కోట్ల భారతీయులు గర్వపడేలా శ్రీరామ విగ్రహ ప్రాణప్రాతిష్ట జరగడం మరిచిపోలేని ఘట్టం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, పెద్దఎత్తున ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.









భాకరాపేట: మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణం, తిరుపతి: భక్తులకు అన్నదానం చేస్తున్న గాండ్లసంఘం నేతలు, రామనామ సంకీర్తన గానం ర్యాలీ చేపడుతున్న పురోహితులు, జైశ్రీరామ్ ఆకృతిలో కూర్చున్న అట్లాంటిస్ స్కూల్ విద్యార్థులు

ముగిసిన హనుమాన్ చాలీసా సప్తాహం

తిరుపతి కల్చరల్: అయోధ్య రామమందిరం ప్రారంభం, బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా శ్రీహనుమద్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై చేపట్టిన అఖండ హనుమాన్ చాలీసా పారాయణ సప్తాహం ఘనంగా ముగిసింది. చివరి రోజు సోమవారం ఉదయం నుంచి హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. సాయంత్రం రాజగోపాల్ నాయుడు భక్త బృందంచే అఖండ హరినామ సంకీర్తన చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా శాంతికల్యాణం నిర్వహించారు. చివరిగా దీపోత్సవం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.


అంతటా జై శ్రీరామ్ నామస్మరణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీచైతన్య స్కూల్లో సోమవారం జై శ్రీరామ్ నినాదం మార్మోగింది. అయోధ్యలో నిర్మించిన రామమందిరంలో శ్రీబాలరాముడి ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని పాఠశాలలో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు జై శ్రీరామ్ అక్షర మాలికలతో శ్రీరామున్ని కొలిచారు. స్కూల్ ప్రిన్సిపల్ అన్నపూర్ణ శ్రీరాముని గాథను వివరించారు.



జై శ్రీరామ్ అక్షర మాలికతో శ్రీరామున్ని కొలుస్తున్న విద్యార్థులు

స్పందనకు 25 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన స్పందన డయల్ యువర్ కమిషనర్‌కు మొత్తం 25 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ హరిత ప్రజల నుంచి ఫిర్యాదులను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి స్వీకరించారు. స్పందనకు 15, డయల్ యువర్ కమిషనర్‌కు 10 ఫిర్యాదులు అందాయి. వీటిపై కమిషనర్ హరిత వివిధ శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుకు సరైన పరిష్కార మార్గం చూపించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులదే అన్నారు. స్పందనలో ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రారెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, కేఎల్ వర్మ, డీఈలు, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

తిరుపతిలో 2,98,239 ఓటర్లు

తిరుపతి నియోజకవర్గంలో మొత్తం 2,98,239 ఓటర్లతో తుది జాబితాను ప్రచురించినట్లు ఓటరు నమోదు అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ప్రకటించారు. తిరుపతిలోని అన్ని పోలింగ్ బూత్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఎలక్షన్ కమిషన్ గుర్తించిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ హరిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ 2023 జనవరి 5వ తేదీ నాటికి తిరుపతి నియోజకవర్గంలో 2,88,123 మంది ఓటర్లు ఉండగా, 2024 జనవరి 22వ తేదీ నాటికి 2,98,239 మంది ఓటర్లుగా నమోదు అయ్యారని చెప్పారు. వీరిలో మహిళలు 1,50,100, పురుషులు 1,48,101, ట్రాన్స్‌జెండర్లు 38 మంది ఉన్నట్లు తెలిపారు. తిరుపతి నియోజకవర్గంలోని 267 పోలింగ్ బూత్‌లలో అవసరమైన ఏర్పాట్లను చేయించేందుకు అన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు ఓటర్ నమోదు అధికారులు తిరుపతి అర్బన్ తహసీల్దారు వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం

- తన సోదరుడు మోహిత్ రెడ్డిని ఆదరించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అభ్యర్థన

చంద్రగిరి: జగనన్న సంక్షేమ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే చెవిరెడ్డి ముందుచూపుతో చేసిన అభివృద్ధి పనులతో చంద్రగిరి రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చంద్రగిరి పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, బజారు వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రామ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆ తర్వాత గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల జాబితాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో తన సోదరుడు మోహిత్ రెడ్డిని ఆదరించాలంటూ ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా, కరోనా సమయంలో అనునిత్యం చంద్రగిరి ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు.

కోదండరామునికి సారె సమర్పణ..

అయోధ్యలో బాలరాముని ప్రతిష్టాపనను పురస్కరించుకుని చంద్రగిరి పట్టణంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వెలుపల భారీ ఎత్తున ఏర్పాటు చేసిన బాలరాముని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన వెంట చంద్రగిరి మండల పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కోదండ రామస్వామివారికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ జాబితాను వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- చంద్రగిరి ఓట్లు 3,08916
- పక్కాగా ఫారం- 6, 7, 8ల తనిఖీ
- బీఎల్ఓల కన్నా ఆన్‌లైన్‌లోనే అధికం
- 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు



రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

తిరుపతి అర్బన్ : చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితా ఎంతో పారదర్శకంగా రూపొందించామని చంద్రగిరి ఈఆర్ఓ(ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్), తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన తమ చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 22వ తేదీ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విడుదల చేసిన తుది జాబితా ప్రకారం చంద్రగిరి నియోజకవర్గంలో 395 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 1,50,249 పురుషులు, 158,607 మహిళలు, 60 ట్రాన్స్‌జెండర్లు, మొత్తం 3,08,916 ఓట్లు ఉన్నాయని వెల్లడించారు. కొత్త ఓటర్లు నమోదుతో పాటు ఓటర్లు మార్పులు, తొలగింపులు, మరో నియోజకవర్గానికి బదిలీలు జరిగాయని చెప్పారు. కొత్త ఓటర్లకు సంబంధించి ఫారం-6లు 52 వేలు వచ్చాయని చెప్పారు. వాటిలో 25 వేలు మాత్రమే సక్రమంగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఫారం-7కి సంబంధించి తొలగింపులు, మృతి చెందిన వారు, అభ్యంతరాలకు సంబంధించి 32,500 వచ్చాయని వాటిలో 18 వేలు సక్రమంగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఫారం-8కి సంబంధించి తప్పుల సవరణ, నివాసం మార్పు, మరో నియోజకవర్గానికి బదలాయింపు తదితర అంశాలకు సంబంధించి 39 వేలు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటిలో 33 సక్రమంగా ఉన్నట్లు గుర్తించామని వివరించారు. పెద్దఎత్తున ఫారం-6, 7, 8లను తనిఖీలు చేశామని వెల్లడించారు. సక్రమంగా లేని వాటిని తొలగించామని వివరించారు. బీఎల్ఓల కన్నా అధిక సంఖ్యలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. తప్పుగా దరఖాస్తులు నమోదు చేసిన వాటిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయని గుర్తు చేశారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న తరుణంలో తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి నూతన ఓటర్ లిస్ట్‌ను అందించారు. అయితే రాజకీయ పార్టీల నేతలు కొందరు ఫొటోలు క్లారిటీగా లేవని చెప్పారు. కొత్త ఓట్లు నమోదుకు అవకాశం ఉందా అంటూ ప్రశ్నించారు. దీంతో ఆర్డీఓ నిశాంత్ రెడ్డి ఫారం-6, 7, 8 దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని వివరించారు. అయితే ఆ జాబితాను చేర్పులు జాబితాగా ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలుపార్టీల నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి